ముగిసిన హార్స్ రైడింగ్ పోటీలు



శంకర్‌పల్లి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): జన్వాడలోని నాసర్ పోలో అండ్ ఈక్వెస్ట్రియన్ అకాడమీలో జరిగిన హైదరాబాద్ హార్స్ షో మాన్సూన్ చాంపియన్ షిప్ పోటీలు సోమవారం ఘనంగా ముగిశాయి. అక్టోబర్ 10న ప్రారంభమైన ఈ పోటీలలో 400మంది యువ రైడర్లు పాల్గొన్నారు.నాసర్ పోలో అకాడమీ చైర్మన్ కుతుబుద్దీన్‌ఖాన్ గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు.



అర్జీలను పరిశీలిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

సమస్యలను పరిష్కరించాలి : కలెక్టర్

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణికి వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ సి. నారాయణరెడ్డి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి ఆయన అర్జీలను స్వీకరించారు. మొత్తం 48 వినతులు రాగా, వీటిల్లో రెవెన్యూ శాఖవి 15, ఇతర శాఖలకు సంబంధించినవి 33 వచ్చాయి.

ఎరువుల కొరత లేకుండా చూడాలి

అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో ఎరువుల కొరత లేకుండా చూడాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సరిపడా గన్నీ బ్యాగులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పత్తి కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు తలెత్తనీయొద్దన్నారు. అలాగే ఇందిరమ్మ ఇళ్లకు స్టేజీల వారీగా లబ్ధిదారులకు డబ్బులు అందేలా చూడాలన్నారు. గ్రామ, మున్సిపలిటీల్లో పారిశుధ్యంపై దృష్టి సారించాలని అన్నారు. ప్రభుత్వ పథకాల అమలుపై సమీక్షించాలన్నారు. వంద శాతం పల్స్ పోలియో చుక్కలు వేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత పాల్గొన్నారు.

నిఖార్సయిన నాయకుడిని

ఎంపిక చేస్తాం

- అందుకోసమే కార్యకర్తలతో అభిప్రాయ సేకరణ
- ఏఐసీసీ పరిశీలకుడు, తమిళనాడు ఎంపీ రాబర్ట్ బ్రూస్
- చేవెళ్ల, శంకర్‌పల్లిలో సంఘటన్ శ్రీజన్ అభియాన్



చేవెళ్లలో మాట్లాడుతున్న రాబర్ట్ బ్రూస్

చేవెళ్ల / శంకర్‌పల్లి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్‌పార్టీ రంగారెడ్డి జిల్లా నూతన అధ్యక్షుడిగా నిఖార్సయిన నాయకుడిని నియమించేందుకు కార్యకర్తల అభిప్రాయాలను సేకరిస్తున్నామని ఏఐసీసీ పరిశీలకులు, తమిళనాడు ఎంపీ రాబర్ట్ బ్రూస్ తెలిపారు. ఇందులో భాగంగా చేవెళ్ల నియోజకవర్గం కేంద్రంలోని అట్లాస్ గార్డెన్‌లో ఏ బ్లాక్ చేవెళ్ల, షాబాద్, మొయినాబాద్ మండలాల నాయకులు, బీ బ్లాక్ శంకర్‌పల్లి, నవాబుపేట్ మండలాల నాయకులు, కార్యకర్తల అభిప్రాయ సేకరణ (సంఘటన్ శ్రీజన్ అభియాన్) కార్యక్రమం వేర్వేరుగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబద్ధత, అంకితభావం, క్రమశిక్షణ గల కార్యకర్తల నుంచే నాయకుడిని ఎన్నుకోవాలనే ఉద్దేశంతో ఈ అభిప్రాయ సేకరణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. దేశంలోని 600పై చిలుకు జిల్లాల్లో ఇదే మోడల్‌ను అనుసరిస్తున్నట్లు స్పష్టం చేశారు. రంగారెడ్డి జిల్లాకు ఉన్నతమైన నాయకత్వ లక్షణాలు ఉన్న నాయకుడిని ఎన్నుకుంటే పార్టీ మరింత బలోపేతం అవుతుందని అభిప్రాయపడ్డారు. డీసీసీ అధ్యక్షుల ఎంపికను పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారన్నారు. అంతకు ముందు ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ మాట్లాడుతూ... నాయకుడు ప్రజల నుంచి ఉద్భవిస్తేనే పార్టీ పటిష్టమవుతుందన్నారు. రాహుల్ గాంధీని ప్రధానిని చేయడానికి కార్యకర్తలు నిబద్ధతో పనిచేయాలని సూచించారు. ఓట్ చోరీతో నరేంద్రమోడీ రెండోసారి ప్రధాని అయ్యారని ఆరోపించారు. చంద్రబాబు, నితీష్‌కుమార్‌ల చేతికర్రలతో మోడీ ప్రభుత్వాన్ని కొనసాగిస్తున్నాడని దుయ్యబట్టారు. నాయకుల మధ్య మనస్పర్థలు ఉంటే నేరుగా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. రెడ్డి సామాజికవర్గానికి చెందిన సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలోని బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారని చెప్పారు. ఈ విషయంలో వెనుకడుగు వేసేది లేదని స్పష్టం చేశారు. అంతకు ముందు

మిగతా 8వ పేజీలో...



నందిగామ గ్రామం

సౌర జిగేల్!

పీఎం సూర్యఘర్ యోజన పైలెట్ ప్రాజెక్టుకు ఎంపికైన 'నందిగామ'

సౌర విద్యుత్ ద్వారా పల్లెల్లో వెలుగులు నింపేందుకు జిల్లాలో తొలి అడుగు పడింది. విద్యుత్ కష్టాలను అధిగమించేందుకు కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకాన్ని అమల్లోకి తెచ్చిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసిన కొన్ని గ్రామాల్లో 100శాతం సోలార్ విద్యుత్ ఏర్పాటు చేసేందుకు సర్కార్ సన్నాహాలు మొదలు పెట్టింది. ఇందులో భాగంగా జిల్లాలోని నందిగామ గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశారు.

- వంద శాతం ప్రభుత్వ కార్యాలయాలపై సోలార్ ప్లాంట్లు
- గృహావసరాలు, వ్యవసాయబోర్లకు సబ్సిడీపై సోలార్
- మిగులు విద్యుత్‌ను అమ్ముకునేందుకు గ్రిడ్ ఏర్పాటు

కెపాసిటీ	ప్రభుత్వ సబ్సిడీ	ఉత్పత్తి అయ్యే యూనిట్లు (కేడబ్ల్యూహెచ్)
1 కేడబ్ల్యూపీ	రూ.30,000	120
2 కేడబ్ల్యూపీ	రూ.60,000	240
3 కేడబ్ల్యూపీ	రూ.78,000	360



(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి) : ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకాన్ని అమల్లోకి భాగంగా జిల్లాలోని నందిగామ గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టు కోసం అధికారులు ఎంపిక చేశారు. ఇక్కడ విజయవంతమైన తరువాత దశలవారీగా మిగతా గ్రామాలకు దీన్ని విస్తరించాలని ప్రభుత్వం భావిస్తోంది. పథకంలో ఎంపికైన నందిగామ గ్రామానికి కోటి రూపాయల నిధులు ప్రభుత్వం మంజూరు చేయనుంది. ఇక్కడ మొదట పంచాయతీ భవనంతో పాటు అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, హెల్త్ సెంటర్‌లకు సోలార్ ప్యానళ్లు అమరుస్తారు. అలాగే స్వయం సహాయక బృందాలు నిర్వహించే సంస్థలు, ఇతర కార్యాలయాలకు కూడా సబ్సిడీపై సోలార్ బిగిస్తారు. స్వయం సహాయక సంఘాలు 10శాతం ఖర్చు భరిస్తే

మిగతా 8వ పేజీలో...

వికసిత్ భారత్ బిల్డాథాన్ ఆవిష్కరణ

- కస్తూర్బాగాంధీ బధిరుల ఉన్నత పాఠశాలలో ప్రారంభం
- హాజరైన డీఈవో సుశీంద్రరావు



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డీఈవో

కందుకూరు,అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కేంద్రం ప్రభుత్వం ప్రవేశపెట్టిన వికసిత్ భారత్ బిల్డాథాన్ -2025ను డీఈవో సుశీంద్రరావు సోమవారం మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బధిరుల ఉన్నత పాఠశాలలో ప్రారంభించారు. మండల విద్యాధికారి హెచ్.నర్సింహ్మా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి డీఈవో హాజరై మాట్లాడారు. దేశవ్యాప్తంగా 273 పాఠశాలలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్‌ఆఫీసర్ ఎ.శ్రీనివాస్‌రావు, జిల్లా గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ సుజాత, స్థానిక పాఠశాల నిర్వాహకులు తీగల భార్గవి, శ్రీరామ్, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గోతులమయం

- అధ్వానంగా మంగళికుంట తండా రోడ్డు
- రాకపోకలకు జనం ఇబ్బందులు
- నరక ప్రాయంగా ప్రయాణం
- నిధులు మంజూరైనా టెండర్లలో జాప్యం
- వెంటనే పనులు చేపట్టాలంటున్న ప్రజలు



7

అండర్‌పాస్‌లు.. డేంజర్ స్పాట్లు!

సూచికలు, రేడియం స్టిక్కర్లు లేక ప్రమాదాలు ● ఇబ్బందుల్లో వాహనచోదకులు.. పట్టించుకోని అధికారులు



సూచికలు లేకుండా ప్రమాదకరంగా కొత్తూర్ అండర్‌పాస్

ప్రమాదాలను నివారించాలి



అండర్‌పాస్ వద్ద ప్రమాదాలు నివారించేందుకు సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలి. సూచికలు, రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. రాత్రి సమయాల్లో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

- నరేష్‌చారి,
ఏబీవీపీ కన్వీనర్, కొత్తూర్

కొత్తూర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన అండర్‌పాస్‌లు డేంజర్ స్పాట్లుగా మారాయి. కొత్తూర్ మండల కేంద్రానికి సమీపంలోని 44వ నెంబర్ జాతీయ రహదారిపై ఉన్న వై జంక్షన్ వద్ద నిత్యం ప్రమాదాలు జరిగి ఎందరో మృత్యువాత పడగా, పలువురు విగతజీవులుగా మారారు. ప్రమాదాలను నివారించాలని గతంలో ఉద్యమాలు కూడ కొనసాగాయి. ఇందుకు స్పందించిన ఎన్‌హెచ్‌ఏఐ వై జంక్షన్ సమీపంలో కోట్లాది రూపాయలు వెచ్చించి అండర్‌పాస్ నిర్మాణం చేపట్టారు. దీనిని వై ఆకారంలో నిర్మించారు. హైదరాబాద్ నుంచి షాద్‌నగర్ నియోజకవర్గంలోని ఆయా ప్రాంతాలకు వచ్చే వాహనాలతో పాటు, వికారాబాద్ జిల్లాలోని ఆయా ప్రాంతాలతో పాటు, కర్నాటకలోని పలు ప్రాంతాలకు వెళ్లే వాహనాలు ఈ అండర్‌పాస్ నుంచి వెళ్లాల్సి ఉంటుంది. కొత్తూర్ నుంచి పెంజర్ల రోడ్డులోకి వెళ్లేందుకు కూడ ఇక్కడి నుంచి వెళ్తుంటారు. దీంతో ఈ దారి వెంట వాహనాల రద్దీ అధికంగా ఉంటుంది. వాహనాలు సమీపంలోకి వచ్చే వరకు కూడా అండర్‌పాస్ కనిపించడం లేదు. అండర్‌పాస్ వద్ద సూచికలు, రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేయకపోవడంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. రాత్రి సమయాల్లో వాహనచోదకులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సి వస్తుంది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని బిక్కుబిక్కుమంటూ వెళ్తుంటారు. ఇదిలా ఉండగా వర్షాకాలంలో అండర్‌పాస్‌లో నీరు నిలుస్తుండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పోలీసులు అండర్‌పాస్‌ను మూసివేసి వాహనాల రూటును మళ్లిస్తుంటారు. గతంలో అండర్‌పాస్‌లో నిలిచిన నీటిలో వాహనాలు చిక్కుకున్న సంఘటనలు కూడా ఉన్నాయి. అండర్‌పాస్ డిజైన్ లోపం కారణంగా వర్షం నీరు వెళ్లకుండా నిలిచిపోతుంది. చేసేదేమీలేక మోటార్ల ద్వారా నీటిని తొలగిస్తుంటారు. అలాగే తిమ్మాపూర్ నుంచి చేగూర్‌కు వెళ్లే రోడ్డులో కూడా రైల్వే అండర్‌పాస్‌ను నిర్మించారు. ఇక్కడ కూడా చేగూర్, గూడూర్ గ్రామాల వాహనాలు వెళ్లేందుకు వై ఆకారంలో అండర్‌పాస్‌ను నిర్మించారు. శంషాబాద్, షాబాద్ మండలాలకు చెందిన పలు గ్రామాల ప్రజలు అండర్‌పాస్ నుంచి వచ్చి వెళ్తుంటారు. ఇక్కడ నుంచి భారీసంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుండటంతో రద్దీగా ఉంటుంది. అండర్‌పాస్ వద్ద గ్రామాలను చూపించే సూచికబోర్డులు, రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేయడంలో కొత్తగా ఈ దారిలో వచ్చేవారు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



తిమ్మాపూర్ రైల్వే అండర్‌పాస్

మొక్కలు నాటి

సంరక్షిద్దాం

జిల్లా డీఆర్‌డీవో సుభాషిణి



నర్సరీని పరిశీలిస్తున్న సుభాషిణి

ఆదిభట్ల/ యాచారం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ నాలుగు మొక్కలు నాటి వాటిని పరిరక్షించి ప్రకృతిని కాపాడాలని జిల్లా డీఆర్‌డీవో సుభాషిణి అన్నారు. సోమవారం యాచారం మండలంలోని గున్‌గల్, చౌదర్‌పల్లి గ్రామాల్లో వనమహోత్సవంలో భాగంగా నాటిన మొక్కలను, ఉద్యానశాఖ తీరును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అటవీ సంపద పెంచుకుంటే వర్షాలు సమృద్ధిగా కురుస్తాయన్నారు. తద్వారా భూగర్భ జలాలు పెరిగి పంటలు బాగా పండుతాయన్నారు. మండలం హైదరాబాద్‌కు సమీపంలో ఉండటంతో రైతులు కూరగాయల సాగుపై దృష్టి సారించేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఖాళీ భూములు, స్కూల్ ఆవరణం, రోడ్ల వెంట పండ్ల మొక్కలు పెంచడం ద్వారా కోతుల బెడద ఉండదన్నారు. కార్యక్రమంలో ఏపీడీవో రాధారాణి, ఏపీవో లింగయ్య, ఈసీ శివశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.



కేటీఆర్‌కు వినతి పత్రం అందజేస్తున్న భూ నిర్వాసితులు

భూ నిర్వాసితులకు అండగా ఉంటాం

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్

కడ్తాల్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): కడ్తాల్ మీదుగా వెళ్తున్న 765 హైటెన్షన్ విద్యుత్ లైన్ భూ నిర్వాసితులకు బీఆర్ఎస్ అన్ని విధాలుగా అండగా ఉంటుందని పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. న్యాయం జరిగేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని హామీ ఇచ్చారు. కడ్తాల మండల కేంద్రాన్ని అనుసరించి పంట పొలాల మీదుగా ఏర్పాటు చేస్తున్న 765 హైటెన్షన్ విద్యుత్ లైన్ అలైన్‌మెంట్‌ను మార్చి టవర్ల నిర్మాణం పనులు నిలిపివేసేలా చూడాలని భూ నిర్వాసితులు కేటీఆర్‌ను కోరారు. సోమవారం ఈ మేరకు కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్ రెడ్డితో కలిసి హైదరాబాద్‌లో కేటీఆర్ నివాసంలో వినతి పత్రం అందజేశారు. కొందరు పారిశ్రామిక వేత్తల, రియల్టర్ల ఒత్తిడితో అలైన్‌మెంట్‌ను మార్చి సాగు చేసుకుంటున్న పంట పొలాల మీదుగా వేస్తున్నారని బాధితులు వాపోయారు. దీంతో స్పందించిన కేటీఆర్ అలైన్‌మెంట్ మార్పు గురించి కేంద్ర విద్యుత్‌శాఖ మంత్రి మాట్లాడుతామన్నారు. మార్చకపోతే బీఆర్ఎస్ తరఫున పోరాట కార్యాచరణ రూపొందిస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహ్మా రెడ్డి, మాజీ జెడ్పీటీసీ దశరథ్ నాయక్, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, బీసీ సంఘం మండల అధ్యక్షుడు పిప్పళ్ల వెంకటేశ్, కడారి రామకృష్ణ, పెంటారెడ్డి, రాములు, కేశవులుగౌడ్, పర్వత్‌కుమార్‌యాదవ్, గణేశ్, శ్రీరాములు గౌడ్, శివ, రాజేందర్ ఉన్నారు.

బీసీలు సంఘటితమై పోరాడుదాం



మాట్లాడుతున్న జంగయ్య

షాబాద్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్ల కోసం బీసీలందరం సంఘటితమై పోరాడుదామని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అన్నారు. షాబాద్‌లో అంబేద్కర్ చౌరస్తాలో 2వ రోజు బీసీ రిజర్వేషన్ సాధన సమితి ఆధ్వర్యంలో సోమవారం రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కొన్నేళ్లుగా బీసీలను అణగదొక్కుతున్నారన్నారు. బీసీలు ఎదిగితేనే రాజ్యాధికారం సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో బీసీ రిజర్వేషన్ సాధన సమితి నాయకులు రవీందర్, రాజేందర్‌గౌడ్, మాణయ్య, రాము, శ్రీశైలం, చంద్రయ్య, చేవెళ్ల స్వామి, నర్సింలు, మల్లయ్య, సత్యనారాయణ, వెంకటయ్యగౌడ్, లింగంగౌడ్, జంగయ్య, దర్శన్, రాజు, అశోక్, రమేష్, సురేష్, మల్లేష్ పాల్గొన్నారు.

తాండూరు బైపాస్‌కు రూ.108 కోట్లు

● భూ నిర్వాసితులకు రూ. 42.53కోట్ల కేటాయింపు

తాండూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): తాండూరు బైపాస్ రోడ్డు కోసం రూ.78 కోట్ల నుంచి రూ.108 కోట్లకు నిధులు పెంచుతూ తెలంగాణ రోడ్లు భవనాల శాఖ జీవో 130ని విడుదల చేసింది. అసంపూర్తిగా ఉన్న పనులు చేపట్టడంతో పాటు భూ నిర్వాసితులకు పరిహారం పెంచింది. భూ నిర్వాహసితులకు రూ.42.53 కోట్లు కేటాయించారు. నాన్‌అగ్రికల్చర్ భూమికి రూ. 6 వేలు, వ్యవసాయ భూమికి ఎకరానికి రూ.21లక్షలు ప్రభుత్వం చెల్లించనుంది. ఇటీవల తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి రోడ్లు భవనాలశాఖ ముఖ్య కార్యదర్శి వికాస్‌రాజ్‌ను కలిసి బైపాస్ రోడ్డు నిర్మాణానికి నిధులు విడుదల చేయాలని రైతులకు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. 2016-17 సంవత్సరంలో రసూల్‌పూర్ నుంచి చెంగోల్ వరకు సుమారు 12 కిలోమీటర్ల మేర బైపాస్ రోడ్డు ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. 18 ఎకరాల మేర రైతులు భూములు కోల్పోతున్నారు. యాలాల మండలం కోకట్, రసూల్‌పూర్‌ గ్రామానికి చెందిన సుమారు 10మంది బైపాస్ రోడ్డు నిర్మాణంలో ప్లాట్లను కోల్పోతున్నారు. అప్పట్లో కొంత మందికి పరిహారం చెల్లించి రూ.35 కోట్ల వ్యయంతో పనులు అసంపూర్తిగా చేసి వదిలేశారు. అంతేకాకుండా అప్పట్లో కొంత మంది రైతులు పరిహారం చెల్లింపులో న్యాయం జరగలేదని కోర్టును ఆశ్రయించడం , భూములు ఇచ్చేందుకు అభ్యంతరాలు తెలపడంతో భూసేకరణ నిలిచిపోయింది. దీంతో పనులు కూడా ఆగిపోయాయి. పరిహారం పెంపు, బైపాస్ రోడ్డు కోసం నిధుల వెచ్చింపుతో ఈ రోడ్డుకు పట్టిన గ్రహణం వీడనుంది. బైపాస్ రోడ్డు లేని కారణంగా పలు వాహనాలు తాండూరు పట్టణం మీదుగా వెళ్తూ దుమ్ముధూళితో పాటు భారీ వాహనాలతో రోడ్లు తింటున్నాయి. బైపాస్ రోడ్డు పూర్తయితే తొలగనున్నాయి. వెంటనే పనులు చేపట్టే విధంగా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి తెలిపారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుదాం



సీపీఎంలో చేరుతున్న బీఆర్ఎస్ నాయకులకు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న యాదయ్య

సీపీఎం జిల్లా కార్యదర్శి యాదయ్య

ఆదిభట్ల/యాచారం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ప్రజలను మోసంగించాయని సీపీఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య అన్నారు. యాచారం మండలం ధర్మన్నగూడ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు నరసింహ, మధు, ఆనంద్‌తో పాటు 30 మంది ధర్మన్నగూడలో ఎర్ర జెండా కప్పుకున్నారు. ఈ సందర్భంగా యాదయ్య మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఎం రాజీలేని పోరాటం చేస్తుందని తెలిపారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవడానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి నరసింహ, శ్రీమన్నారాయణ, తావునాయక్, అంజయ్య పాల్గొన్నారు.

అభినయంతో అలరించిన హితిక



షాద్‌నగర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కూచిపూడిలో అద్భుత హావభావాలతో, అభినయంతో అలరించింది షాద్‌నగర్ పట్టణానికి చెందిన 8వ తరగతి విద్యార్థిని హితిక. దేవీ శరన్నవరాత్రోత్సవాల సందర్భంగా మహతి ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని తెలుగు విశ్వ విద్యాలయంలో సంగీత, నృత్య నీరాజనం కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించారు. హితిక బ్రహ్మాంజలి అనే గానంపై ప్రదర్శించిన కూచిపూడి నృత్యం ఆకట్టుకుంది. నాట్య గురువు సజని వల్లభనేని చేతుల మీదగా మెమోంటో, ప్రశంసాపత్రం అందుకుంది. ప్రభోదయ డాన్స్ మ్యూజిక్ అకాడమికి చెందిన గురువు రంజు ప్రవీణ వద్ద హితిక శిక్షణ తీసుకుంది.

ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగించొద్దు

శంకర్‌పల్లి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): వీధి వ్యాపారులు ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగించొద్దని శంకర్‌పల్లి మున్సిపల్ మేనేజర్ అంజన్‌కుమార్ కోరారు. శంకర్‌పల్లి మున్సిపల్‌లో సోమవారం మున్సిపల్ సిబ్బందితో కలిసి వీధి వ్యాపారులు, దుకాణాదారులకు పలు సూచనలు చేశారు. రోడ్డుకు అడ్డంగా బండ్లు పెట్టి ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆనంద్, వార్డు అధికారులు ఉన్నారు.



పశువులకు టీకాలు వేయించాలి

షాబాద్/మొయినాబాద్ రూరల్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): పశువులు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలని పశువైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన రైతులతో మాట్లాడుతూ.. ఈ నెల 15 నుంచి వచ్చే నెల 15వ తేదీ వరకు మండలంలోని 41 గ్రామ పంచాయితీల్లో పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేస్తామని తెలిపారు. పశువులు కలిగిన రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



షాబాద్: మాట్లాడుతున్న డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి

వచ్చే నెల 14 వరకు..

మొయినాబాద్ మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో పశువులు, జీవాలకు ఈ నెల 15 నుంచి వచ్చే నెల 14వ తేదీ వరకు గాలికుంటు నివారణ టీకాలను వేస్తామని మొయినాబాద్ మండల పశువైద్యాధికారి డాక్టర్ అహ్మద్ పేర్కొన్నారు. పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మొదటి రోజు కార్యక్రమాన్ని మున్సిపల్ పరిధిలోని సురంగల్ గ్రామంలో ప్రారంభిస్తామని పేర్కొన్నారు.

విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు

మాడ్గుల, అక్టోబరు 13(అంధ్రజ్యోతి): ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని కస్తూర్బా గాంధీ ఉన్నత పాఠశాల విద్యార్థినులకు పోషకాహార మసోత్సవంపై సూపర్‌వైజయమ్మ వ్యాచరచన పోటీలు నిర్వహించారు. రక్తహీనత రాకుండా ఉండటానికి ఆకుకూరలు, కాయగూరలు పండ్లు, చిరుధాన్యాల అవసరంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ఎస్‌వో రేఖ, అంగన్‌వాడీ టీచర్ హైమావతి, రాణి, తదితరులు పాల్గొన్నారు.

కేశంపేట: పోషణ మాసంలో భాగంగా సోమవారం మండల పరిధిలోని సంగెం ప్రాథమికోన్నత పాఠశాలలో 7, 8 తరగతుల విద్యార్థులతో సీఐడీఎస్ కొత్తపేట సెక్టార్ సూపర్ వైజర్ శమంతకమణి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కిశోర బాలికలు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలన్నారు. అనంతరం విద్యార్థినులకు 'తినే ఆహారం.. శారీరక పెరుగుదల' అనే అం శంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన ఇద్దరికి బహుమతులు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాటీ టీచర్లు శశికళ, శివలీల, ఆశా కార్యకర్త అరుణ, ఉపాధ్యాయునిలు శివజ్యోతి, ప్రసన్న, దీపిక పాల్గొన్నారు.



మాడ్గుల: వ్యాచరచన పోటీల్లో విద్యార్థినులు

నిల్వ చేసిన పత్తికి నిప్పు పెట్టిన దుండగులు

●15 క్వింటాళ్ల పత్తి కాలి బూడిదైన వైనం



ఎక్మాయి శివారులో కాలి బూడిదైన పత్తి

బషీరాబాద్, అక్టోబరు12(ఆంధ్రజ్యోతి): ఓ రైతు వ్యవసాయ పొలంలో నిల్వ చేసిన పత్తికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో కాలిబుడిదైంది. ఈ సంఘటన బషీరాబాద్ మండలం ఎక్మాయి శివారు ప్రాంతంలో సోమవారం ఉదయం వెలుగుచూసింది. గ్రామానికి చెందిన దానం కృష్ణ తన వ్యవసాయ పొలంలో ఆదివారం పత్తిని తీయించి అక్కడే నిల్వ చేశాడు. ఈ క్రమంలో రాత్రివేళ పత్తికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో దాదాపు 15 క్వింటాళ్ల కాటన్ పూర్తిగా కాలిపోయింది. కాలి బూడిదైన పత్తి విలువ రూ.లక్షా30వేల పైబడి ఉంటుందని రైతు కన్నీటి పర్యంతమయ్యారు. విషయం తెలుసుకున్న బషీరాబాద్ ఎస్‌ఐ నుమాన్‌అలీ ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుత్ కోతల చెక్‌కు సమ్మర్ యాక్షన్ ప్లాన్

● అదనంగా 23 ట్రాన్స్‌ఫార్మర్ల కోసం ప్రతిపాదనలు

తాండూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖలో సమ్మర్ యాక్షన్ ప్లాన్‌పై అప్పుడే అధికారులు దృష్టి సారించారు. వచ్చే సమ్మర్‌లో విద్యుత్ కోతలు లేకుండా తీసుకోవాల్సిన చర్యలపై సీఎండీ ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా తాండూరు డివిజన్‌లో ప్రతీరోజు 100 మెగావాట్ల విద్యుత్ వాడకం ఉంటుంది. వేసవిలో 125 -130 మెగావాట్ల వరకు విద్యుత్ వాడకం పెరుగుతుంది. విద్యుత్ వినియోగం పెరిగితే తరుచూ ట్రాన్స్‌ఫార్మర్లు ఫీడర్లపై భారం పడి కాలిపోవడంతో పాటు మరమ్మతుల్లో జాప్యం, విద్యుత్ అంతరాయం వంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. దీంతో అవసరమైన చోట అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటుకు బడ్జెట్ అంచనాలు రూపొందిస్తున్నారు. ఫీడర్‌లపై 150యాప్స్‌కు మించితే లోడ్‌ను డైవర్ట్ చేసేందుకు సర్వే మొదలు పెట్టారు. తాండూరు సర్కిల్‌లో ఓవర్‌లోడ్‌ను తట్టుకునేందుకు అదనంగా 23 ట్రాన్స్‌ఫార్మర్లు అవసరం ఉందని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించారు. పురాతన, డ్యామేజ్ అయిన కండక్టర్ల వైర్లను మార్చాలని నిర్ణయించారు. విద్యుత్ వాడకం ఎక్కువ ఉన్న ప్రాంతాలను గుర్తించి అవసరమైన ట్రాన్స్‌ఫార్మర్లను అదనంగా ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. ఇప్పటికే లైన్‌మన్‌లు, లైన్ ఇన్‌స్పెక్టర్ ద్వారా ప్రాథమిక సమాచారాన్ని అధికారులు సేకరించారు.

భవిష్యత్ తరాలకు ఉపాధే ప్రభుత్వ లక్ష్యం

కందుకూరు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): భవిష్యత్తు తరాలకు ఉపాధి అవకాశాలు కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, రానున్న స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపునకు నాయకులు, కార్యకర్తలు కలిసి పనిచేయాలని కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం దాసర్లపల్లికి చెందిన జంబుల శివరాంరెడ్డి ఆధ్వర్యంలో వివిధ పార్టీల కార్యకర్తలు, నాయకులు కేఎల్లార్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వచ్చే పదేళ్ల పాటు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమే ఉంటుందని తెలిపారు. మహేశ్వరం నియోజకవర్గ అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి ఈ ప్రాంతంలో ఫ్యూచర్ సిటీతో పాటు ఏటీసీ, స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మహేశ్వరం ఏఎంసీ చైర్మన్ కృష్ణానాయక్, మాజీ జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, సొసైటీ చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి, నాయకులు మల్లేష్, గంగుల శమంతప్రభాకర్‌రెడ్డి, యుగేందర్‌గౌడ్, పాండురంగారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, రాణాప్రతాప్‌రెడ్డి, మదన్‌పాల్‌రెడ్డి, జంగయ్య, శేఖర్, రాములు, యాదయ్య, కృష్ణ, లింగమయ్య, శ్రీపాదయ్య, రంగయ్య పాల్గొన్నారు.



కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న దాసర్లపల్లి నాయకులు

డీసీసీ అధ్యక్ష పదవి కోసం ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ ప్రయత్నాలు



ఆమనగల్లు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ జిల్లా అధ్యక్ష పదవి కోసం కడ్తాల మండలం మైసిగండి గ్రామానికి చెందిన టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్ తీవ్ర స్థాయిలో ప్రయత్నాలు సాగిస్తున్నారు. పార్టీ అదిష్ఠానం, అగ్రనేతలను కలిసి తనకు డీసీసీ అధ్యక్షుడిగా అవకాశం కల్పించాలని అభ్యర్థిస్తున్నారు. డీసీసీ అధ్యక్ష పదవుల్లో బీసీలకు సముచిత స్థానం పార్టీ కల్పిస్తుందన్న సమాచారంతో శ్రీనివాస్‌గౌడ్ ఆ పదవిని దక్కించుకునేందుకు ప్రయత్నాలు తీవ్రతరం చేశారు. కాంగ్రెస్ పార్టీకి శ్రీనివాస్‌గౌడ్ మూడు దశాబ్దాలుగా సేవలు అందిస్తున్నారు. 2006-2014 వరకు మైసిగండి ఎంపీటీసీగా, 2013లో ఉమ్మడి ఆమగల్లు పీఏసీఎస్ చైర్మన్‌గా, సుమారు ఏడేళ్ల పాటు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా సేవలందించారు. 2014లో చల్లా వంశీచంద్‌రెడ్డి గెలుపు కోసం, గత అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి విజయంకోసం కృషి చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తనకు నామినేటెడ్ పోస్టుల్లో అవకాశం కల్పించాలని చాలా కాలంగా అధిష్ఠానంపై శ్రీనివాస్ గౌడ్ ఒత్తిడి తెస్తున్నారు. తన విధేయతను గుర్తించాలని అభ్యర్థిస్తున్నారు. చల్లా వంశీచంద్‌రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, మల్లు రవిలకు ఆయిళ్ల అత్యంత సన్నిహితుడిగా మెలుగుతూ వస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డితో కూడా ఆయనకు మంచి పరిచయం ఉంది. గౌడ సామాజిక వర్గానికి చెందిన శ్రీనివాస్‌గౌడ్‌కు బీసీల్లో కూడా గట్టిపట్టుంది. పార్టీలో తగిన గుర్తింపు లభిస్తుందని శ్రీనివాస్‌గౌడ్ అనుచరులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

సీఎం రేవంత్‌ను కలిసిన ఆచారి



ఆమనగల్లు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర నాయకుడు తల్లోజు ఆచారి సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్ నివాసంలో సీఎంను కలిసి శాలువాతో సత్కరించారు. ఈ నెల 31న జరిగే తన కుమారుడు తల్లోజు భరత్ నిశ్చితార్థానికి రావాలని సీఎంకు ఆచారి ఆహ్వానపత్రికను అందజేశారు. అలాగే ఆమనగల్లులో ఆర్డీవో, సబ్ రిజిస్ట్రార్, ఎస్టీవో, ఆర్టీఏ కార్యాలయాలను ఏర్పాటు చేయాలని, అసంపూర్తిగా నిలిచిన ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణాన్ని పూర్తి చేయించాలని ఈ సందర్భంగా సీఎంను కోరినట్టు ఆచారి తెలిపారు. అలాగే డిగ్రీ, పాలిటెక్నిక్ కాలేజీలు నిర్మించాలని, ఆమనగల్లు మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరగా సానుకూలంగా స్పందించినట్లు ఆచారి పేర్కొన్నారు.

సీఎంతో ఆసిఫ్ అలీ



కడ్తాల్, అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): రేవంత్ మిత్రమండలి రాష్ట్ర అధ్య క్షుడు ఆసిఫ్ అలీ సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కడ్తాల మండల అభివృద్ధికి ప్రభుత్వం తోడ్పాటునందించాలని,ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని సీఎంను కోరగా సానుకూలంగా స్పందించారని ఆసిఫ్ తెలిపారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

మేడ్చల్‌టౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) మేడ్చల్ మున్సిపల్ పరిధిలో నెలకొన్న మంచి నీటి సమస్యనుపరిష్కరించాలని కోరుతూ బీజేపీ నాయకులు సోమవారం కలెక్టర్ మనుచౌదరికి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈసందర్భంగా మేడ్చల్ మున్సిపల్ బీజేపీ అధ్యక్షురాలు శైలజ మాట్లాడుతూ రెండు నెలలుగా మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో మిషన్ భగీరథ నీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయిందన్నారు. పలు మార్లు స్థానిక మున్సిపల్ అధికారులకు, మిషన్ భగీరథ సిబ్బందికి వినతులు సమర్పించినప్పటికీ పట్టించుకోవటం లేదని ఆరోపించారు. మిషన్ భగీరథ నీరు సరఫరా అయ్యేలా చూడాలని కలెక్టర్‌ను కోరారు.



కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న బీజేపీ నాయకులు

పైసా ఖర్చు లేకుండా కార్పొరేట్ వైద్యం

- తాండూరులోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ఆపరేషన్లు
- ఆరోగ్యశ్రీ కింద ఆర్థో, జనరల్ సర్జరీలు



తాండూరు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): తాండూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులు వివిధ ఆపరేషన్లను నిర్వహిస్తుండటంతో బీద రోగులకు ఎంతో ప్రయోజనం చేకూరుతోంది. ఆస్పత్రి సూపరింటెండెంట్ వినయ్‌కుమార్ ఆధ్వర్యంలో రెండు నెలలుగా ఆరోగ్యశ్రీ కింద 50 ఆపరేషన్లు నిర్వహించారు. వాటిలో అత్యధికంగా ఆర్థో కేసులు ఉన్నాయి. రోడ్డు ప్రమాదాలు, ప్రమాదవశాత్తు తీవ్ర గాయాలై బోన్ ఫ్రాక్చరైన వారికి కార్పొరేట్ స్థాయిలో వైద్యాన్ని అందిస్తున్నారు. గతంలో కేసులను హైదరాబాద్‌కు రిఫర్ చేసేవారు. తాండూరు ఆస్పత్రిలో ఆపరేషన్ థియేటర్లు, అధునాతన పరికరాలు అందుబాటులో ఉండటంతో వైద్యులు సైతం శస్త్ర చికిత్సలకు ముందుకొస్తున్నారు. ఆస్పత్రిలోని సిటి స్కాన్, ఎక్స్‌రే, మందులు, మత్తువైద్యులు ఉండటంతో ఆపరేషన్ల నిర్వహణకు సులువైంది. నయాపైసా ఖర్చు కాకుండా ఆస్పత్రిలో చికిత్సలు అందుతుండడంతో రోగులు కూడా సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

సకాలంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



వికారాబాద్‌లో కలెక్టర్‌తో చర్చిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, తదితరులు

తాండూరు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): రైతులకు ఇబ్బందులు రాకుండా సకాలంలో వడ్లు, పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ ప్రతీక్‌జైన్‌కు విన్నవించారు. మాజీ జెడ్పీటీసీ ధారాసింగ్, మాజీ సర్పంచ్ ఉత్తంచంద్‌తో కలిసి సోమవారం కలెక్టర్‌ను కలిశారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇబ్బందులు లేకుండా ఇసుక పర్మిషన్లు ఇవ్వాలని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. తాండూరు-హైదరాబాద్ రోడ్డులో ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని, నియోజకవర్గానికి మంజూరైన సబ్‌స్టేషన్లను త్వరగా ఏర్పాటు చేయాలని తదితర ముఖ్య సమస్యలపై కలెక్టర్‌కు ఎమ్మెల్యే వివరించారు.

సీజేఐపై దాడి హేయమైన చర్య



కలెక్టర్ నారాయణరెడ్డికి వినతి పత్రం ఇస్తున్న ఎమ్మార్పీఎస్ శ్రేణులు

ఆదిభట్ల, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై దాడి భారత న్యాయ వ్యవస్థపై దాడేనని, దాడికి పాల్పడిన అడ్వకేట్ రాకేశ్‌కిషోర్‌ను అరెస్టు చేసి శిక్షించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల్ల ఉపేందర్ అన్నారు. సోమవారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయానికి ఎమ్మార్పీఎస్ నాయకులు ర్యాలీగా వచ్చి ఆందోళన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై షూతో దాడి చేయడం దారుణం అన్నారు. కుల, మతాల పేరుతో విద్వేషాన్ని నింపుకొని దాడులకు దిగడం సరికాదన్నారు. రాజ్యాంగం వల్లే అన్ని కులాలకు న్యాయం అందుతోందన్నారు. సీజే గవాయి నిమ్న వర్గాలకు చెందిన వ్యక్తి కావడమే దాడికి కారణామా? అని ప్రశ్నించారు. ఈ విషయంలో నిందితులను శిక్షించే వరకు ఎమ్మార్పీఎస్ నిరసనలు చేపడుతుందన్నారు. ఈ నెల 22న హైదరాబాద్‌లో నిరసన ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం కలెక్టర్ నారాయణరెడ్డికి వినితిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య, జిల్లాధ్యక్షుడు బాబు, ఎమార్పీఎస్ నాయకులు కృష్ణ, శ్రీనివాస్, రమేష్, సతీష్, మహేష్, శ్రీకాంత్, నాగభూషణ్ పాలొనారు.

గవాయ్‌పై దాడికి నిరసనగా ఎమ్మార్పీఎస్ ధర్నా



ధర్నా అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

వికారాబాద్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): దళితుడైన సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్‌పై న్యాయవాది రాకేశ్‌కిషోర్ చేసిన దాడిని ఖండిస్తూ మాదిగ మహాజన సోషలిస్టు పార్టీ(ఎమ్మార్పీఎస్) ఆధ్వర్యంలో సోమవారం వికారాబాద్‌లోని కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు పి.ఆనంద్ మాట్లాడుతూ.. చీఫ్ జస్టిస్‌పై దాడి దేశ ప్రజాస్వామ్యంపై దాడి అన్నారు. దాడిచేసిన న్యాయవాదిపై దేశద్రోహం కేసు నమోదు చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు. దళితుడైన గవాయ్ సీజేఐగా ఉండడం జీర్ణించుకోలేని అధర్మ శక్తులు ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి ప్రశాంత్, జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్, ప్రధాన కార్యదర్శి సుభాష్, నాయకురాలు పుష్పరాణి, సీనియర్ నాయకులు భరత్‌కుమార్, మంజుల, పద్మమ్మ, సునీత తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన తప్పనిసరి

మేడ్చల్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): అధికారుల నుంచి సామాన్య ప్రజల వరకు అందరికీ సీపీఆర్‌పై అవగాహన ఉండాలని డీఎంహెచ్‌వో ఉమాగౌరి సూచించారు. మేడ్చల్ కలెక్టర్ ఆవరణలో సోమవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో పునర్జన్మ పేరుతో సీపీఆర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. వివిధ శాఖల జిల్లా అధికారులకు, కలెక్టర్, ప్రజలకు సీపీఆర్‌పై వైద్యులు అవగాహన కల్పించారు. సీపీఆర్‌పై అవగాహన లేకపోవడం వల్ల కలిగే ప్రాణనష్టం గురించి వివరించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. పునర్జన్మ వారోత్సవాల్లో భాగంగా వారం రోజులు అన్ని కళాశాలల్లో, బస్టాండ్‌లలో, రైల్వేస్టేషన్‌ల వద్ద అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. వైద్యులు శ్రవణ్, వినోద్, శోభన సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమం టలో ప్రోగ్రాం అధికారి మల్లీశ్వరి, ఆయా శాఖల అధికారులు, వైద్యులు గీత, శ్రీదేవి, సత్యవతి, చంద్రకళ, వసంతకుమారి, వినోద్ పాల్గొన్నారు.



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్లు

క్రీడాకారులకు అండగా ఉంటా..

షాద్‌నగర్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు కులమతాలు, పార్టీలు అనే బేదం లేకుండా స్వేచ్ఛగా ఆటలు ఆడుకోవచ్చని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. విజయదశమి వారోత్సవాలను పురస్కరించుకుని షాద్‌నగర్‌లో ఎమ్మెల్యే శంకరన్న క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో క్రికెట్ పోటీ విజేతలకు నగదు బహుమతితో పాటు మెమొంటోలను క్రీడాకారులకు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి క్రీడలను ప్రోత్సహించేందుకు కృషిచేస్తున్నారని తెలిపారు. తన దృష్టి లో క్రీడలు ప్రతీ మనిషికి అవసరం అని, క్రీడాకారులు గ్రామీణ స్థాయిలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు అంతర్జాతీయ స్థాయిలో క్రీడలకు పూర్తి సహకారం అందుతుందని అన్నారు. క్రికెట్



విజేతలకు ట్రోఫీని అందజేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

పోటీలో విజయం సాధించిన ఫరూఖ్‌నగర్ అడ్డు జట్టుకు రూ.లక్ష నగదు, రన్నర్ టీంకు రూ.50వేల నగదుతో పాటు ట్రోఫీని అందజేశారు. కార్యక్రమంలో తిరుపతిరెడ్డి, కృష్ణారెడ్డి, రఘునాయక్, బస్వం, పురుషోత్తంరెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

పెద్దేముల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్యం పట్ల నిర్లక్ష్యం వహించొద్దని డివిజనల్ పంచాయతీ అధికారి ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని కందనెల్లి గ్రామాన్ని సోమవారం సందర్శించారు. నర్సరీని, పంచాయతీ రికార్డులను పరిశీలించారు. గ్రామంలో మురుగు కాల్వలు ఎప్పటికప్పుడూ శుభ్రంగా ఉండేలా పూడిక తీయించాలని కార్యదర్శిని ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీవో తరన్‌సింగ్, పంచాయతీ కార్యదర్శి నరేశ్ తదితరులు పాల్గొన్నారు.



నర్సరీని పరిశీలిస్తున్న డీఎల్‌పీవో

మంగళికుంట తండా రోడ్డంతా... గోతులమయం

20ఏళ్లుగా కనీస మరమ్మతులకు నోచుకోని రెండు జిల్లాలను కలిపే దారి

- రాకపోకలకు జనం ఇబ్బందులు.. నరకప్రాయంగా ప్రయాణం
- నిధులు మంజూరైనా టెండర్లలో జాప్యం
- వెంటనే పనులు చేపట్టాలంటున్న ప్రజలు



బీటీ లేచిపోయిన మంగళికుంట తండా రోడ్డు

ఆమనగల్లు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు మండలం పోలెపల్లి గేటు నుంచి పోలెపల్లి మీదుగా మంగళికుంట తండా వరకు ఉన్న బీటీ రోడ్డు పూర్తిగా శిథిలమై నరకప్రాయంగా మారింది. ఈ రోడ్డుపై రాకపోకలకు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 20ఏళ్ల క్రితం నిర్మించిన 3కిలో మీటర్ల ఈ రోడ్డు నిర్వహణ లేక ఎక్కడికక్కడ బీటీ లేచిపోయి గుంతలమయంగా మారింది. రెండు జిల్లాలను కలిపే ఈ రోడ్డు ఇటీవలి వర్షాలకు మరింత దెబ్బతింది. దీంతో ఈ రోడ్డుపై తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రోడ్డు మీదుగా ఆమనగల్లు, నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ, కల్వకుర్తి, చారగొండ, మండలాల గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. వెల్దండ మండలం అంకమోనికుంట, సల్లపల్లి, బొల్లంపల్లి గ్రామాల వారికి ఈ రోడ్డు సౌకర్యంగా ఉంది. మాడ్గుల, ఆమనగల్లు మండలాల పలు గ్రామాల ప్రజలు ఈ రోడ్డుగుండానే కల్వకుర్తి పట్టణానికి వెళ్తుంటారు. రోడ్డు నిర్మాణ సమయంలో నాణ్యత పాటించకపోవడం, అప్పట్లో యంత్రాలతో కాక కూలీలతో పనులు చేయించడం, నిర్వహణ లోపంతో రోడ్డు పూర్తిగాపాడైంది. పోలెపల్లి గేటు నుంచి మంగళికుంట తండా వరకు బీటీ రోడ్డు పనులకు రెండేళ్ల కింద రూ.64లక్షలు మంజూరయ్యాయి. 2023 ఆగస్టు 29న అప్పటి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పనులకు శంకుస్థాపన చేశారు. టెండర్ నిర్వహించినా పనులు మాత్రం ప్రారంభం కాలేదు. పనులు ప్రారంభం కాక మంజూరైన నిధులు సైతం ల్యాప్స్ అయ్యాయి.

రూ.కోటి నిధుల మంజూరు

మంగళికుంట తండా రోడ్డు రిపేర్ చేయించాలని గ్రామాలు, తండాల ప్రజలు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డిపై ఒత్తిడి తెచ్చారు. రోడ్డు బాగలేక పడుతున్న ఇబ్బందులను వివరించారు. ఆయన స్పందించి చొరవ తీసుకొని పది నెలల క్రితం ఎంఆర్ఆర్ గ్రాంట్ కింద రూ.కోటి మంజూరు చేయించారు. దీంతో రోడ్డు వేస్తారని ప్రజలు భావించారు. అయితే నెలలు గడుస్తున్నా టెండర్ల ప్రక్రియైనా పూర్తికాక పనులు ప్రారంభించలేదు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు నిరుత్సాహానికి గురవుతున్నారు.

పనులు త్వరగా పూర్తి చేయించాలి



పోలెపల్లి గేటు-పోలెపల్లి మీదుగా మంగళి కుంట తండా రోడ్డు పూర్తిగా పాడైంది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. రోడ్డుపై గోతులేర్పడి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. స్థానిక ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకొని పనులు త్వరగా చేయించేలా చర్యలు తీసుకోవాలి. అధికారులు టెండర్ల ప్రక్రియ త్వరగా చేపట్టాలి.

\- శోభచందూనాయక్, కొత్తకుంట తండా

ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్నాం



మూడు కిలోమీటర్ల రోడ్డు పూర్తిగా దెబ్బతిని రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. 2003లో ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన కింద వేసిన రోడ్డుకు నేటికీ మరమ్మతులు చేయలేదు. దీనిపై నడవడం కూడ ఇబ్బందిగా మారింది. రోడ్డు మరమ్మతులు చేసి మా ఇబ్బందులు తీర్చాలని ఏళ్లుగా ప్రజాప్రతినిధులను, అధికారులను కోరుతున్నాం. ఎవరూ పట్టించుకోవడం లేదు. నెల రోజుల్లో రోడ్డు పనులు చేపట్టకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతాం.

\- దోనాదుల కుమార్, పోలెపల్లి

టెండర్ల ప్రక్రియ మొదలైంది



ఎంఆర్ఆర్ గ్రాంట్ కింద పోలెపల్లి గేటు-మంగళికుంట తండా మూడు కిలో మీటర్ల రోడ్డు మరమత్తు, ఆధునికీకరణకు జనవరిలో రూ.కోటి నిధులు మంజూరయ్యాయి. ఇటీవల పనులకు టెండర్ల ప్రక్రియ చేపట్టాం. టెండర్లు పూర్తికాగానే పనులు పూర్తిచేసి ప్రజల ఇబ్బందులు తీరుస్తాం.

\- శ్రీనివాస్‌రెడ్డి, పీఆర్-డీఈఈ, ఆమనగల్లు

ప్యాచ్‌వర్క్ పెండింగ్...

- ఇప్పలపల్లి-కమ్మదనం రోడ్డు పనుల్లో జాప్యం
- కంకరతో వాహనదారుల ఇక్కట్లు



కంకర పరిచి వదిలేసిన రోడ్డు

కేశంపేట, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్-ఆమన్‌గల్ రోడ్డులో ఇప్పలపల్లి-కమ్మదనం దారికి చేపట్టిన ప్యాచ్‌వర్క్ పనులు నత్తనడకన సాగుతున్నాయి. కంకర వేసి వదిలేయడంతో వాహనదారుల ఇక్కట్లు అన్నీ ఇన్ని కావు. కేశంపేట మండలం ఇప్పలపల్లి నుంచి ఫరూఖ్‌నగర్ మండలం కమ్మదనం వరకు ఉన్న ఈ బీటీ రోడ్డు వర్షాలకు అక్కడక్కడ దెబ్బతిని గుంతలేర్పడ్డాయి. దీంతో ఇబ్బందులు పడుతున్నామని కాంగ్రెస్ నాయకులు స్థానిక ఎమ్మెల్యే శంకర్ దృష్టికి తీసుకపోయారు. స్పందించిన ఆయన ప్యాచ్ పనులకు నిధులు మంజూరు చేయించారు. పనులు చేపట్టిన కాంట్రాక్టర్ సిమెంట్, కాంక్రీట్, కంకర పరిచి వదిలేశాడు. ఇంత వరకు బీటీ వేయలేదు. కంకర పోసినచోట వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. కంకరతో దుమ్ము లేస్తోంది. అధికారులు స్పందించి ప్యాచ్ పనులను త్వరగా పూర్తి చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

పనులు వెంటనే ప్రారంభించాలి



ఇప్పలపల్లి-కమ్మదనం రోడ్డులో ప్యాచ్ పనులను వెంటనే ప్రారంభించాలి. ప్యాచ్ వర్క్ వద్ద కంకర వేసి వదిలేయడంతో రాత్రి పూట వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. దుమ్ములేస్తూ కళ్లలో పడుతోంది. ఈ రోడ్డులో టీవీలర్లు నడపలేం. అధికారులు కాంట్రాక్టర్‌తో మాట్లాడి వెంటనే పనులు చేయించాలి.

\- శ్రీనివాస్, సీఐటీయూ మండల కన్వీనర్

బురదమయం.. కొత్తకుంట తండా రోడ్డు



ఆమనగల్లు మండలం పరిధి పోలెపల్లి-కొత్తకుంట తండా రోడ్డుపై అడుగడుగునా గోతులేర్పడ్డాయి. కొన్ని రోజుల క్రితం కురిసిన వర్షానికి రోడ్డంతా నీటి గుంతలతో దర్శనమిస్తోంది. తండా వాసులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. పోలెపల్లి-కొత్తకుంట తండా వరకు 2.5కిలోమీటర్ల రోడ్డు ధ్వంసమైంది. గతంలో ప్రభుత్వం రోడ్డు పనులకు రూ.1.5కోట్లు మంజూరు చేయగా పనులకు శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత నిధులు రాక పనులు చేయలేదు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చొరవ తీసుకొని తండాకు బీటీ రోడ్డు నిర్మించి ఇబ్బందులు తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

కేఎల్‌హెచ్ అజీజ్‌నగర్‌కు ఏడు స్టార్టప్స్

- హర్షం వ్యక్తం చేసిన అధ్యాపకులు, విద్యార్థులు



విద్యార్థులతో కేఎల్‌హెచ్ అధ్యాపకులు

మొయినాబాద్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి) : మొయినాబాద్ మండలంలోని కేఎల్‌హెచ్ క్యాంపస్ విద్యార్థుల సృజనాత్మక ఆలోచనలతో సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలు జరుగుతున్నాయని కేఎల్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ వైస్ ప్రెసిడెంట్, ఇంజినీర్ లక్ష్మణ్ హవీష్, కేఎల్‌హెచ్ అజీజ్‌గనర్ క్యాంపస్ ప్రిన్సిపాల్ డాక్టర్, రామకృష్ణ తెలిపారు. సోమవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ.. అజీజ్‌గనర్ క్యాంపస్ హైదరాబాద్‌కు గర్వకారణమైన మైలురాయిని చేరుకుందన్నారు. క్యాంపస్ విద్యార్థుల నేతృత్వంలోని ఏడు స్టార్టప్‌లకు ఐఐటీ హైదరాబాద్ ఐటీ హబ్ నుంచి మొత్తం రూ.19లక్షల నిధులు వచ్చాయని చెప్పారు. ఈ నిధులు ఆరోగ్యరంగం, రోబోటిక్స్, డ్రోన్ టెక్నాలజీ, ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, ఇంటలిజెన్స్ ఎలక్ట్రానిక్ సిస్టమ్స్ వంటి రంగాల్లో ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు కేటాయిస్తామని తెలిపారు. గత సంవత్సరంలోనూ కేఎల్‌హెచ్ హైదరాబాద్ క్యాంపస్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ విద్యార్థి ఆర్యుమాన్‌కుమార్‌చౌదరి తన స్టార్టప్ కోసం ఇలాంటి నిధులు పొందాడన్నారు. క్యాంపస్‌లో ఉన్న బలమైన ఆవిష్కరణ వాతావరణానికి ఇది ప్రతీక అన్నారు.విద్యార్థుల సృజనాత్మకత ఆలోచనాశక్తి, అధ్యాపకుల కృషికి ఇది ఫలితం అన్నారు. విద్య అనేది అకడమిక్ ప్రావీణ్యానికి మాత్రమే పరిమితం కాదన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు ఉండొద్దు

- అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి):వానాకాలం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో మాట్లాడుతూ .. ముందస్తు ప్రణాళిక ప్రకారం అన్ని విభాగాలు సమన్వయంతో కొనుగోళ్లు నిర్వహించాలన్నారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. వ్యవసాయ శాఖ ద్వారా ధాన్యం సేకరణ వివరాలు సక్రమంగా డాటా ఎంట్రీలో పొందుపర్చాలన్నారు. రవాణా, డ్రైమిషన్‌లు, ప్యాడీ క్లీనర్లు, వేయింగ్ మిషన్లను సిద్ధం చేయాలని ఆయన సూచించారు. రాష్ట్ర సరిహద్దుల్లో ధాన్యం అక్రమ రవాణా నివారణకు రావులపల్లి, కోత్లాపూర్ వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలన్నారు. కేంద్రాల్లో గన్నీ సంచులు, తాగునీరు, టెంట్లు, ఫస్ట్ ఎయిడ్ కిట్లు వంటివి ఉండేలా చూడాలన్నారు. ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని చెప్పారు. రైతుల బ్యాంక్ ఖాతాల్లో ఆలస్యం లేకుండా డబ్బులు జమయ్యేలా చూడాలని స్పష్టం చేశారు. సమావేశంలో డీఆర్‌డీవో శ్రీనివాస్, అదనపు ఎస్పీ రాములునాయక్, సివిల్‌సప్లయీస్ అధికారి సుదర్శన్, డీసీవో నాగార్జున, పౌర సరఫరాల సంస్థ మేనేజర్ మోహన్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో మెరుగైన వసతుల కల్పన



హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేయిస్తున్న గూడూరు శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పాలనలో ప్రజలకు మెరుగైన వసతులు సమకూరి ఇబ్బందులు తొలుగుతున్నాయని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కడ్తాలలోని బీసీ కాలనీలో హైమాస్ట్ లైట్ల ఏర్పాటును సోమవారం శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. కల్వకుర్తి ఎమ్మెల్యే నారాయణరెడ్డి నిధుల నుంచి లైట్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మండలంలో అభివృద్ధి పనులకు నిధల మంజూరుకు ఎమ్మెల్యే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. గ్రామాల్లో అంతర్గత రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణం, తాగునీటి వసతి కల్పన, పారిశుధ్య కార్యక్రమాలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. అభివృద్ధిలో రాజకీయాలకు చోటు లేదని, ప్రజా సంక్షేమం, అభివృద్ధిల్లో ప్రజలంతా పాలు పంచుకోవాలని శ్రీనివాస్ రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి క్యామ రాజేశ్, నాయకులు యాదయ్య, బుచ్చయ్య, కృష్ణ, రాజేందర్ గౌడ్, రాఘవేందర్, చందు, బుద్ధిరామ్, తిరుమల్లేశ్, జంగయ్య, చంద్రయ్య, బ్రహ్మాచారి, శ్రీను, పాండు, మహేశ్, శ్రీకాంత్, రమేశ్, సేవానాయక్, పవన్, రాజు పాల్గొన్నారు.

ఉద్యోగాలు సృష్టించేలా కృషి చేయాలి



అల్యూమినేట్ వర్క్‌షాప్‌లో సెయింట్ పీటర్స్ కళాశాల విద్యార్థులు

మేడ్చల్ టౌన్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి):సాంకేతిక విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు కేవలం ఉద్యోగాలు సంపాదించేలా కాకుండా ఉద్యోగాలు సృష్టించేస్థాయికి ఎదగాలని వ్యాపారవేత్త నవీన్‌కుమార్ అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడ సెయింట్ పీటర్స్ ఇంజనీరింగ్ కళా టశాలలో సోమవారం అల్యూమినేట్ వర్క్‌షాప్ నిర్వహించారు. దీనికి నవీన్‌కుమార్ హాజరై మాట్లాడుతూ.. ఇంజనీరింగ్ విద్యార్థులు ఎక్కువగా ఉద్యోగం సాధించి స్థిరపడేందుకు యోచిస్తారన్నారు. ఉద్యోగం చేయడం కన్నా ఉద్యోగాలు కల్పించేలా ఎదగాలన్నారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి టీవీ.రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ టి.సరోజారెడ్డి, అడ్మినిస్ట్రేటీవ్ డైరెక్టర్ టి.అనురాగ్‌రెడ్డి, పీఆర్వో రవి, సుధాకర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ



చేవెళ్ల, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ చేయడం సంతోషకరంగా ఉందని రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు చింపుల సత్యనారాయణరెడ్డి అన్నారు. సోమవారం దేవుని ఎర్రవల్లి, రామన్నగూడ, సింగప్పగూడ గ్రామాలకు చెందిన ఆరుగురు విద్యార్థులకు సైకిళ్లు అందజేశారు. అయన మాట్లాడుతూ.. దేవుని ఎర్రవల్లి స్కూలుకొచ్చే విద్యార్థులకు మరిన్ని సైకిళ్లు అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో గ్రామస్తులు, నాయకులు శ్రీనివాస్, సామ రంగారెడ్డి, మల్లారెడ్డి, రవీందర్, రామ్‌రెడ్డి, సత్యనారాయణ, శివయ్య, రాజిరెడ్డి, జంగయ్య గౌడ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జేఏసీ ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ

కొడంగల్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): కొడంగల్‌కు మంజూరైన మెడికల్, వెటర్నరీ కళాశాలలు, పాత కొడంగల్‌లో ఇంటిగ్రేటెడ్ గురుకులాలను స్థానికంగానే ఏర్పాటు చేయాలని కొడంగల్ అభివృద్ధి, పరిరక్షణ ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు అన్నారు. సోమవారం కొడంగల్‌లో ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా ప్రజల సంతకాల సేకరణ చేశారు. వ్యాపారులు, కుల, మత వర్గ బేధం లేకుండా ప్రజలు సంపూర్ణ మద్దతు తెలుపుతూ విద్యాసంస్థలను తరలించొద్దని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐక్య కార్యాచరణ కమిటీ కన్వీనర్ కోట్రికె లక్ష్మీనారాయణగుప్తా, కోశ న్వీనర్లు సురేశ్‌కుమార్, ఎరన్‌పల్లి శ్రీనివాస్, రమేశ్‌బాబు పాల్గొన్నారు.



సంతకాల సేకరణ చేపడుతున్న జేఏసీ నాయకులు



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న శంకర్

పెండింగ్ ఉపకార వేతనాలు చెల్లించాలి

ఆమనగల్లు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా బెస్ట్ అవేలబుల్ పాఠశాలల యాజమాన్యానికి చెల్లించాల్సిన పెండింగ్ ఉపకార వేతనాలు వెంటనే విడుదల చేయాలని కందుకూరు డివిజన్ ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ, విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు జంతుక శంకర్ కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ నారాయణ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం ఉపకార వేతనాలు చెల్లించకపోవడం వల్ల ప్రైవేట్ పాఠశాలల నిర్వాహకులు విద్యార్థులను అనుమతించడం లేదని పేర్కొన్నారు. వెంటనే ఉపకార వేతనాలు విడుదల చేసి పేద పిల్లల చదువులకు ఆటంకం లేకుండా చూడాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో సామాజిక కార్యకర్తలు రేవల్లి రాజు, వెంకటేశ్ ఉన్నారు.

టపాసుల దుకాణాలకు అనుమతులు తప్పనిసరి

మొయినాబాద్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): దీపావళిని పురస్కరించుకొని టపాసుల దుకాణాలు ఏర్పాటు చేయాలనుంటున్న వారు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని మొయినాబాద్ సీఐ పవన్‌కుమార్‌రెడ్డి సోమవారం ప్రకటనలో తెలిపారు. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మొయినాబాద్ మండలంలో పటాసుల అమ్మకాల కోసం తాత్కాలిక లైసెన్స్‌లు జారీ చేస్తున్నామని తెలిపారు. అనుమతులు లేకుండా దుకాణాలు ఏర్పాటు చేయడం చట్టరీత్యా నేరమని పేర్కొన్నారు. దుకాణాల ఏర్పాటుకు ఈ నెల 16 లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సన్మార్గంతోనే దైవానుగ్రహం

కడ్తాల్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): సన్మార్గంతో దైవానుగ్రహం లభిస్తుందని డీసీసీ ప్రధాన కార్యదర్శి నేనావత్ బీక్యనాయక్ అన్నారు. దైవ కార్యక్రమాల్లో ప్రతీ ఒక్కరు పాలు పంచుకోవాలని సూచించారు. కడ్తాల మండలం కానుగుబావి తండాలో నూతనంగా నిర్మిస్తున్న తుల్జాభవాని మాత ఆలయ నిర్మాణానికి గాన్గుమర్ల తండాకు చెందిన మూణావత్ రాజు రూ. 10,116 విరాళం ప్రకటించారు. సోమవారం ఆలయ నిర్వాహకులకు బీక్యనాయక్ సమక్షంలో నగదును అందజేశారు. ఈ సందర్భంగా రాజును సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో నాయకులు పాండునాయక్, బీచ్యనాయక్, సేవ్యనాయక్, మోత్యనాయక్, శ్రీను నాయక్, భాను నాయక్, రాజునాయక్ ఉన్నారు.

భక్తి శ్రద్ధలతో ఫాతిమా ఉత్సవాలు

కొత్తూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని ఫాతిమాపూర్‌లోని ఫాతిమా మాత చర్చి వార్షిక ఉత్సవాలను క్రైస్తవ భక్తులు ఘనంగా జరుపుకున్నారు. సోమవారం తెల్లవారుజాము నుంచే భక్తులు చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఉత్సవాలకు ముఖ్య అతిథిగా నల్లగొండ బిషప్ కరణం దామన్‌కుమార్ హాజరయ్యారు. మధ్యాహ్నం ఫాతిమామాత ఊరేగింపు నిర్వహించారు. చర్చి ఫాదర్ సైమన్ రెడ్డి, ఆయా ప్రాంతాల నుంచి భారీగా భక్తులు హాజరయ్యారు.

మాజీ ఎంపీటీసీ మృతి.. నేతల సంతాపం



నివాళులర్పిస్తున్న నాయకులు

తలకొండపల్లి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దేవునిపడకల్ మాజీ ఎంపీటీసీ ఎం.స్వరూప అనారోగ్యంతో మృతి చెందింది. సోమవారం ఆమె మృతదేహాన్ని ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు డోకూరు ప్రభాకర్ రెడ్డి, టీపీసీసీ కిసాన్ సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ మిట్టపల్లి అంజయ్య, మాజీ సర్పంచ్ కాడెమోని శ్రీశైలం, పాండు రెడ్డి సందర్శించి నివాళులర్పించారు. ఆమె భర్త లయన్స్‌క్లబ్ ఆమనగల్లు మాజీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణను పరామర్శించి సంతాపం తెలిపారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

షాద్‌నగర్ రూరల్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని సోమవారం ప్రకటనలో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ డిమాండ్ చేశారు. రైతులు మొక్కజొన్న పంటను నిల్వ చేసుకోవడానికి వసతులు లేక తక్కువ ధరకు దళారులకు అమ్ముకుంటున్నారని తెలిపారు. క్వింటా మొక్కజొన్నలకు రూ.2,400 మద్దతు ధర ఉందని, ప్రతి రైతుకు కనీస మద్దతు ధర అందెలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి క్లస్టర్‌లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు.

నిఖార్సయిన నాయకుడిని ఎంపిక చేస్తాం

(ఐదో పేజీ తరువాయి)

డీసీసీ మాజీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. గుజరాత్ మోడల్‌ను అనుసరించి జిల్లా అధ్యక్షుడి ఎంపికను చేపడుతున్నట్లు ఆయన వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో పార్టీని బలోపేతం చేయాలనే ఉద్దేశంతోనే కార్యకర్తల అభిప్రాయంతోనే నాయకుడి ఎంపిక జరుగుతుందన్నారు. ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చుతుందని ఆనందం వ్యక్తం చేశారు. చేవెళ్ల నియోజకవర్గం ఇంచార్జీ పామెన భీంభరత్ మాట్లాడుతూ... డీసీసీ అధ్యక్ష పదవిని చేవెళ్ల నియోజకవర్గం వారికి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో పీసీసీ పరిశీలకులు కోమటిరెడ్డి వినయ్‌రెడ్డి, విజయారెడ్డి, కొత్వాల్ అబ్దుల్లా, రాష్ట్ర పొల్యూషన్ బోర్డు సభ్యుడు చింపుల సత్యనారాయణ, కాంగ్రెస్ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి భీంభరత్, పీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్, పీసీసీ కార్యవర్గ కార్యదర్శి ఉదయ్ మోహన్‌రెడ్డి, మొయినాబాద్ మాజీ జెడ్పీటీసీ శ్రీకాంత్, ఏ బ్లాక్ అధ్యక్షుడు మల్లారెడ్డి, బీ బ్లాక్ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, చేవెళ్ల, శంకర్‌పల్లి అధ్యక్ష కార్యదర్శులు వీరేందర్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, రవీందర్ రెడ్డి, చేవెళ్ల మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, పీఏసీఎస్ ఛైర్మన్‌లు వెంకట్‌రెడ్డి, గోనె ప్రతాప్‌రెడ్డి, చేవెళ్ల మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జె. శ్రీకాంత్‌రెడ్డి, మార్కెట్ కమిటీ ఛైర్మన్‌లు పెంటయ్యగౌడ్, వైస్ ఛైర్మన్ కాశెట్టి చంద్రమోహన్, సీనియర్ నాయకులు బల్వంత్‌రెడ్డి, వసంతం, శ్రీనివాస్, నర్సింలు, నాగమణి, గోపాల్‌రెడ్డి, శేరి అనంత్‌రెడ్డి, ఎజాస్, మైసయ్య, సమి ఖురేషి ఉన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్



సమావేశానికి హాజరైన నాయకులు

ఐదుగురి దరఖాస్తు

డీసీసీ అధ్యక్షుడి నియమాకం కోసం చేవెళ్ల నియోజకవర్గం నుంచి ఐదుగురు నాయకులు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో రాష్ట్ర పొల్యూషన్ బోర్డు సభ్యుడు చింపుల సత్యనారాయణరెడ్డి, చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్, సీనియర్ నాయకులు మల్గారి జనార్ధన్‌రెడ్డి, గౌరి సతీష్, ఉదయ్‌మోహన్‌రెడ్డి దరఖాస్తు చేసుకున్నారు.

కాంగ్రెస్ నేతల మధ్య గందరగోళం

అభిప్రాయ సేకరణ కార్యక్రమంలో ఎమ్మెల్యే కాలె యాదయ్య, పామెన భీంభరత్ వర్గీయుల మధ్య విభేదాలు మరోసారి బయటపడ్డాయి. రాబర్టు బ్రూస్, అద్దెంకి దయాకర్, పీసీసీ సభ్యుల సమక్షంలోనే పార్టీ చేవెళ్ల మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ తనను వేదికపైకి ఆహ్వానించకపోవడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. అభిప్రాయ కమిటీలో 17 మంది నాయకుల పేర్లలో తన పేరు ఎందుకు లేదని నిలదీశారు. కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పనిచేసిన వారి పేర్లు లేకుండా భీంభరత్ వర్గీయుల పేర్లు ఉండడం ఎంతవరకు న్యాయమన్నారు. దీంతో అక్కడే ఉన్న కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జె.శ్రీకాంత్‌రెడ్డి కలుగచేసుకొని తమకు కూడా ఎమ్మెల్యే యాదయ్య ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదని వాదించారు. దీంతో ఇరువురి మధ్య వాదనలు చోటుచేసుకుని కొంతసేపు గందోరగోళ పరిస్థితి నెలకొంది. అనంతరం అద్దెంకి దయాకర్, చల్లా నర్సింహారెడ్డి కలుగు చేసుకుని ఇద్దరిని సముదాయించారు.

ఒక్కరి నేత్ర దానంతో ఇద్దరికి దృష్టి భాగ్యం



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న చంద్రశేఖర్

ఆమనగల్లు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ఒక్కరి నేత్ర దానంతో ఇద్దరికి దృష్టి భాగ్యం కలుగుతుందని లయన్స్‌క్లబ్ జిల్లా చైర్మన్లు ఎం.చంద్రశేఖర్, నటరాజ్ యాదయ్య అన్నారు. ఆమనగల్లు ప్రభుత్వ ఆసుపత్రిలో సోమవారం జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో ఆమనగల్లు లయన్స్‌క్లబ్, ఎనుగొండ రాంరెడ్డి లయన్స్ కంటి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. మొత్తం 65 మందికి కంటి పరీక్షలు చేసి 15 మందికి దృష్టి లోపం ఉన్నట్లు గుర్తించి ఐవోఎల్ ఆపరేషన్ల నిమిత్తం ఎనుగొండ రాంరెడ్డి లయన్స్ కంటి ఆసుపత్రికి తరలించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ పీఆర్‌వో ఎంఏ పాషా, ఉపాధ్యక్షుడు ఎంగళి బాలకృష్ణ, సంయుక్త కార్యదర్శి కొరివి వెంకటయ్య, డాక్టర్ మైమునా బేగం, ఎంపీహెచ్‌ఈవో తిరుపతిరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

తలకొండపల్లి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): పేదల ఆత్మగౌరవ ప్రతీక ఇందిరమ్మ ఇళ్లు అని మాజీ ఎంపీటీసీ అంబాజీ, కాంగ్రెస్ జిల్లా నాయకులు అజీజ్, ఎండీ ఆరీఫ్ అన్నారు. తలకొండపల్లి మండలం వెల్జాల గ్రామంలో సోమవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. పలువురు లబ్ధిదారుల స్లాబ్ నిర్మాణ పనులను ప్రారంభించారు. ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని సూచించారు. అర్హులందరికీ రాజకీయాలకతీతంగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరవుతాయని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణయ్య, లక్ష్మణ్, విష్ణు, ఆయిలయ్య, రాజు పాల్గొన్నారు.

బీఎస్పీ జిల్లా అధ్యక్షుడిగా దొడ్డి శ్రీనివాస్



శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న నాయకులు

షాద్‌నగర్ రూరల్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): బీఎస్పీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడుగా దొడ్డి శ్రీనివాస్ నియమితులైనారు. ఎల్బీనగర్‌లో సోమవారం జరిగిన రంగారెడ్డి జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఈ మెరకు రాష్ట్ర అధ్యక్షుడు ఇబ్రాం శేఖర్ జిల్లా అధ్యక్షుడుగా శ్రీనివాస్‌ను నియమించారు. ఫరూఖ్‌నగర్ మండలం వెలిజర్ల గ్రామానికి చెందిన శ్రీనివాస్ వృత్తి రిత్యా న్యాయవాది. గతంలో బీఎస్పీ షాద్‌నగర్ అసెంబ్లీ అధ్యక్షుడుగా రెండు పర్యాయాలు, అసెంబ్లీ ఇంచార్జీగా, జిల్లా ప్రదాన కార్యదర్శిగా జిల్లా ఇంచార్జీగా పని చేశారు. జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన ఆయనను షాద్‌నగర్ బీఎస్పీ నాయకులు ఘనంగా సన్మానించారు. సన్మానించిన వారిలో నాయకులు నర్సింలు, శ్రీనివాస్, మహేందర్, ఆంజనేయులు, మహేష్ ఉన్నారు.

'కాంగ్రెస్‌లో మైనార్టీలకు గుర్తింపు లేదు'



మాట్లాడుతున నాయకులు

చేవెళ్ల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌లో కష్టపడి పని చేసినా తమకు గుర్తింపు లేకుండా పోయిందని పార్టీ మైనార్టీ మండల ఉపాధ్యక్షుడు అజీమ్, ప్రధాన కార్యదర్శి సలీమ్ అన్నారు. సోమవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ.. పార్టీ గెలుపునకు ఎంతో కష్టపడి పని చేసినా అది షానం గుర్తించడం లేదన్నారు. పార్టీ కార్యక్రమాల గురించి తమకు సమాచారం ఇవ్వడం లేదని వాపోయారు. పార్టీలో తమను చిన్నచూపు చూస్తున్నారని, మైనార్టీ ఓట్లు పార్టీకి వేయించేందుకు తమవంతుగా కృషి చేశామని చెప్పారు. మండలంలో మైనార్టీలందరితో సమావేశం ఏర్పాటు చేసి త్వరలోనే బీఆర్ఎస్‌లో చేరుతామని స్పష్టం చేశారు.

విజయవాడ కనకదుర్గకు ముక్కుపుడక

కందుకూరు, అక్టోబరు 13(ఆధ్రజ్యోతి): మండలంలోని కందుకూరు గ్రామానికి చెందిన దుర్గాదేవి మండప నిర్వాహకులు సోమవారం విజయవాడలోని కనకదర్గ అమ్మవారికి ముక్కుపుడకను సమర్పించి మొక్కు తీర్చుకున్నారు. ప్రతి సంవత్సరం దేవీ శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా గ్రామంలోని శివాలయం ఆవరణంలో దుర్గామాత విగ్రహాన్ని ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు నిర్వహిస్తారు. ఈ ఏడాది కూడా అమ్మ వారిని భక్తిశ్రద్ధలతో కొలిసి విజయవాడ కనకదుర్గ అమ్మవారికి ముక్కుపుడక సమర్పించారు.



మొక్కులు చెల్లించుకుంటున్న మండప నిర్వాహకులు

సౌర జిగేల్!

(ఐదో పేజీ తరువాయి)

మిగతా 90శాతం ప్రభుత్వం సబ్సిడీగా అందచేయనుంది. అలాగే సాధారణ గృహవసరాలు, వ్యవసాయ బోర్లకు కూడా సబ్సిడీపై సోలార్ పలకలను అమర్చనున్నారు. ఎంపిక చేసిన గ్రామంలో గ్రిడ్ ఆధారిత సోలార్ పలకలను ఏర్పాటు చేసి పూర్తిస్థాయిలో విద్యుత్ ఉత్పత్తి చేసి వినియోగిస్తారు. మిగులు విద్యుత్‌ను గ్రిడ్‌కు సరఫరా చేస్తారు. దీంతో నందిగామ గ్రామంలో ఇక విద్యుత్ కష్టాలు పూర్తిగా తొలగనున్నాయి. రెడ్కో (రాష్ట్ర పునరుత్పాదక శక్తి అభివృద్ధి సంస్థ) విద్యుత్ సంస్థలు కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయి. తొలుత ఈ పథకం నిబంధనల మేరకు 2011 జనాభా లెక్కల ప్రకారం జిల్లాలో 5వేలకు మించి జనాభా ఉన్న 14 గ్రామాలను గుర్తించారు. ఆరుట్ల, షాబాద్, అబ్దుల్లాపూర్, మహేశ్వరం, దండుమైలారం, రాయిపోల్, నందిగామ, ఇనుముల సర్వే, కడ్తాల్, ఆలూరు, చేవెళ్ల, మాడ్గుల, కొందుర్గు, పాల్మాకుల్ గ్రామాలను గుర్తించి ఇందులో అనువైన గ్రామాన్ని ఎంపిక చేసేందుకు జిల్లా స్థాయి అధికారులతో ప్రత్యేక కమిటీ వేశారు. కలెక్టర్ చైర్మన్‌గా ఉన్న కమిటీలో అదనపు కలెక్టర్ వైస్ చైర్మన్‌గా డీపీఓ, డిస్కమ్ ఎస్ఈలు, జెడ్పీ సీఈఓ, రెడ్‌కో జిల్లా మేనేజర్‌తో పాటు లీడ్ బ్యాంక్ మేనేజర్ సభ్యులుగా ఉన్నారు. ఈ గ్రామాలపై పూర్తి కసరత్తు చేసిన కమిటీ చివరకు నందిగామ గ్రామాన్ని అనువైన గ్రామంగా ఎంపిక చేసింది. గ్రామంలో ప్రభుత్వ, ప్రభుత్వేతర ఆధారంగా నిర్మించబడే సోలార్ ఆధారిత ప్లాంట్ (నిర్ణీత గ్రామపరిధిలో స్థాపించే) కెపాసిటీని పరిగణనలోకి తీసుకుని నందిగామ గ్రామాన్ని ఎంపిక చేశారు. గ్రామంలో 1939 కిలోవాట్ల సోలార్ ఉత్పత్తి అవసరమని అంచనా వేశారు.



మిగులు విద్యుత్ అమ్ముకోవచ్చు

ఆదర్శ గ్రామంలో సోలార్ ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను స్థానిక అవసరాలకు వినియోగిస్తారు. అదనంగా ఉత్పత్తి అయ్యే దానిని డిస్కమ్‌లకు లబ్ధిదారులు అమ్ముకునే విధంగా పథకాన్ని రూపొందించారు. ఇలా లబ్ధిదారులు డిస్కమ్‌లకు విక్రయించే మిగులు విద్యుత్‌కు సంబంధించి యూనిట్‌కు రూ.3.20 చొప్పున చెల్లిస్తారు. దీనివల్ల లబ్ధిదారులకు కొంత ఆదాయం కూడా లభించనుంది. ఈ విధానం ద్వారా లబ్ధిదారులతో పాటు ప్రభుత్వానికి కూడా ప్రయోజనం చేకూరనుంది. గృహ వినియోగదారులకు సబ్సిడీపై సోలార్ పలకలను ప్రభుత్వం అందిస్తోంది. సోలార్ యూనిట్లను ఏర్పాటు చేసుకోవడం ద్వారా విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించుకోవడంతో పాటు విద్యుత్ విక్రయంతో ఆదాయం పొందేందుకు ఆస్కారం ఉంది. సోలార్ యూనిట్‌ను 25ఏళ్ల పాటు నిరంతరాయంగా వినియోగించుకోవచ్చు. సోలార్‌కు ఏర్పాటయ్యే ఖర్చును లబ్ధిదారులు తిరిగి ఐదేళ్లలో పొందే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. అలాగే వ్యవసాయానికి సంబంధించి ఉత్పత్తి చేస్తున్న సోలార్ విద్యుత్‌ను కూడా డిస్కమ్‌లకు అమ్ముకుని కొంత ఆదాయం పొందవచ్చు. సోలార్ యూనిట్‌ను 25 ఏళ్లపాటు నిరంతరాయంగా వినియోగించుకోవచ్చు.

పథకం అమలు ఇలా...

ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజన పథకం కింద ఎంపిక చేసిన గ్రామంలోని ప్రభుత్వ కార్యాలయాలు, విధి దీపాలకు ప్రభుత్వమే ఉచితంగా సోలార్ ప్యానళ్లు ఏర్పాటు చేస్తుండగా.. గృహవసరాలకు, వ్యవసాయ బోర్లకు సబ్సిడీపై సోలార్ ప్యానళ్లు అమరుస్తున్నారు. గృహాలు, కార్యాలయాలు, ఇతర వసరులకు రెండు లేదా మూడు కిలో విద్యుత్ వాట్ల (కిలో వాట్ పీక్)ఉత్పత్తి చేసే సోలార్ ప్యానళ్లు అమరుస్తారు. అలాగే వ్యవసాయానికైతే 5కిలో వాట్లకు పైగా విద్యుత్ ప్యానళ్లు అమరుస్తారు. ఒక్కో కిలో యూనిట్ సోలార్ ఏర్పాటుకు దాదాపు రూ.60 వేల వరకు ఖర్చవుతుంది. కిలో యూనిట్‌కు రూ.30వేలు, రెండు కిలో యూనిట్లకు రూ.60వేలు, మూడు కిలో యూనిట్లకుపైగా ఉంటే గరిష్టంగా రూ.78వేలు సబ్సిడీ ఇస్తారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు

సోలార్ ప్యానల్ ఏర్పాటు చేసుకోవాలనుకునే ఆసక్తి ఉన్న వినియోగదారులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. https//pmsuryaghar.gov.in పోర్టల్‌లో లాగిన్ అయి ఇంటికి సంబంధించిన విద్యుత్ మీటర్ యూఎస్సీ నంబర్‌ను ఎంటర్ చేస్తే వివరాలు వస్తాయి. దీని ద్వారా ఎన్ని కిలోవాట్‌ల సోలార్ పరికరాలు అవసరమవుతాయి అనే వివరాలను ఇందులో నమోదు చేసుకోవాలి. ఈ దరఖాస్తును విద్యుత్ శాఖ అధికారులు పరిశీలించి యూనిట్ ఏర్పాటుకు అనుమతులు ఇస్తారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా గృహ వినియోగదారులు అందరూ పీఎం సూర్యఘర్ పథకం వినియోగించుకొని తమ ఇళ్లపై సోలార్ పలకలను సబ్సిడీపై ఏర్పాటు చేసుకోవాలని రెడ్కో మేనేజర్ టి.వేణుగోపాల్ ప్రజలను కోరారు. సోలార్ ఏర్పాటు ద్వారా విద్యుత్ బిల్లులను తగ్గించుకోవడమే కాకుండా తిరిగి ఆదాయాన్ని పొందవచ్చన్నారు. లబ్ధిదారులు తాము పెట్టిన నిర్మాణ వ్యయాన్ని 5 సంవత్సరాల్లో తిరిగి పొందవచ్చన్నారు. ఇప్పుడు ఏర్పాటు చేసుకునే సోలార్ ప్లాంట్‌ను 25 సంవత్సరాలపాటు నిరంతరం వినియోగించుకోవచ్చని పేర్కొన్నారు.

అక్రమ కట్టడాలను తొలగించాలి



కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న స్థానికులు

కొత్తూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలోని పాత జాతీయ రహదారి నుంచి పాత గ్రామపంచాయతీ కార్యాలయం వెళ్లే రోడ్డులో వెలసిన అక్రమ కట్టడాలతోపాటు, డబ్బాలను తొలగించాయువ నాయకుడు కార్తీక్ రెడ్డి కోరారు. ఈ మేరకు స్థానికులతో కలిసి మున్సిపల్ కమిషనర్ బాలాజీని కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో శ్రవణ్, కుమార్, సురేందర్, రాజు ఉన్నారు.

పది తులాల బంగారం చోరీ

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం టౌన్ బోయవాడ రోడ్డులో ఆదివారం రాత్రి తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో గుర్తు తెలియని దుండగులు చొరబడి పది తులాల బంగారు ఆభరణాలు, కొంత నగదును దోచుకెళ్లారు. పోలీసుల కథనం ప్రకారం.. ఇబ్రహీంపట్నం టౌన్ బోయవాడ రోడ్డులో నివాసముంటున్న ఎలమోని రవీందర్ కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం సాయంత్రం ఫంక్షన్‌కని నగరంలోని నేరేడ్‌మెట్‌లో సోదరి ఇంటికి వెళ్లారు. సోమవారం సాయంత్రం తిరిగి వచ్చేసరికి ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. అల్మారాలో ఉన్న పది తులాల బంగారు ఆభరణాలు, ఉన్న కొంత నగదును దుండగులు దోచుకెళ్లారు. క్లూస్ టీం వచ్చి వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



శేఖర్ (ఫైల్)

కడ్తాల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. కడ్తాల్ మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ సమీపంలో సోమవారం ఈ సంఘటన చోటు చేసుకుంది. సీఐ గంగాధర్ తెలిపిన వివరాల ప్రకారం.. కడ్తాల్ మండల కేంద్రానికి చెందిన జల్కం శేఖర్(36) బైక్‌పై పొలానికి వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిని అనుసరించి ఉన్న ఓ వెంచర్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్ర గాయాలపాలైన శేఖర్‌ను చికిత్స నిమిత్తం కందుకూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతడికి భార్య శివలీల, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటోను ఢీకొట్టిన కారు: ఇద్దరికి గాయాలు

తలకొండపల్లి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ఆటోను కారు ఢీకొట్టిన ఘటనలో దంపతులిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన సోమవారం తలకొండపల్లి మండలం చుక్కాపూర్ గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చుక్కాపూర్ గ్రామానికి చెందిన దేశం అశోక్‌రెడ్డి, సుమతమ్మ దంపతులు పొలం పనులు ముగించుకొని పశువులకు ట్రాలీ ఆటోలో గడ్డి తీసుకొని వస్తున్నారు. చుక్కాపూర్ గ్రామ సమీపంలో ఆమనగల్లు నుంచి తలకొండపల్లి వైపు అతి వేగంగా వస్తున్న కారు ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న అశోక్‌రెడ్డి, సుమతమ్మ తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం గాయపడ్డ వారిని హైదరాబాద్‌కు తరలించారు. ఈ మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

భర్తను హత్య చేసిన కేసులో భార్య అరెస్టు



మాధవి, నిందితురాలు

కేశంపేట, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): భర్తను హత్య చేసిన కేసులో భార్యను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు కేశంపేట సీఐ నరహరి తెలిపారు. కేశంపేట గ్రామానికి చెందిన కొప్పు కుమార్(35)ను అతని భార్య మాధవి ఆదివారం ఇంట్లో గడవపడి ఆవేశంలో సిమెంట్ ఇటుకతో తల, చాతిపై మోది హత్య చేసి పారిపోయింది. ఆదే రోజు సాయంత్రం కేశంపేట వైఎస్ఆర్ చౌరస్తా నుంచి వెళ్తున్న మాధవిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నేరం అంగీకరిండంతో సోమవారం వైద్య పరీక్షలు చేయించి కోర్టులో హాజరు పరచామని తెలిపారు. మెజిస్ట్రేట్ 14 రోజల జ్యుడీషియల్ రిమాండ్ విధించడంతో జైలుకు తరలించారు. కుటుంబ సమస్యలుంటే చట్టపరంగా పరిష్కరించుకోవాలే తప్ప, చట్టాని చేతిలోకి తీసుకోవద్దని సూచించారు.

కుక్కల దాడిలో 30 గొర్రెల మృత్యువాత

మొయినాబాద్ రూరల్, అక్టోబరు 13(ఆంధ్యజ్యోతి): కుక్కల దాడిలో 30 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. ఈ ఘటన మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని అజీజ్‌నగర్ వార్డులో సోమవారం జరిగింది. గ్రామానికి చెందిన బొంతల రాజుకు 30కి పైగా గొర్రెలు ఉన్నాయి. వాటితోనే జీవనం సాగిస్తూ ఉపాధి పొందుతున్నాడు. సోమవారం బొంతల రాజు మేత కోసం తన గొర్రెలను గ్రామ సమీపంలోకి తీసుకువెళ్లాడు. అక్కడ గొర్రెలమందపై కుక్కలుదాడి చేయడంతో 30 గొర్రెలు మృత్యువాతపడ్డాయి. దీంతో బాధితుడు తన జీవనోపాధి పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వమే సాయమందించి ఆదుకోవాలని వేడుకుంటున్నాడు. బొంతల రాజు కుటుంబాన్ని ఆదుకోవాలని యాదవ సంఘం మండల సభ్యులు ప్రభుత్వాన్ని కోరారు.

నాగర్‌గూడలో వైన్‌షాప్‌నకు కన్నం

షాబాద్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నాగర్‌గూడలో వైన్‌షాప్ వెనకాల కన్నం వేసి నగదు ఎత్తుకెళ్లిన సంఘటన షాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డి తెలిపిన వివరాల మేరకు మండల పరిధిలోని నాగర్‌గూడలోని దుర్గాభవాని వైన్స్‌లో కప్ప హరిబాబు రోజు మాదిరిగానే ఆదివారం రాత్రి 10 గంటలకు షాప్ మూసివేసి ఇంటికి వెళ్లాడు. సోమవారం ఉదయం షాప్ పక్కన ఉండే మల్లేష్ హరిబాబుకు ఫోన్ చేసి వైన్స్ వెనకాల పెద్ద రంధ్రం చేసి ఉండగా వెంటనే పోలీసులకు తెలిపాడు. తర్వాత షాప్ తెలిచి చూడగా అందులో రూ.43 వేల నగదును గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. హరిబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటుతో ఆర్టీసీ డ్రైవర్ మృతి

ఆదిభట్ల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆదిభట్ల మున్సిపల్ రాందాస్‌పల్లికి చెందిన కంతి కిషన్ గుండెపోటుతో సోమవారం మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రాందాస్‌పల్లికి చెందిన కిషన్ ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. కిషన్‌కు సోమవారం గుండెపోటు రావడంతో మృతి చెందాడు. స్థానికులు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డికి తెలపడంతో ఆయన కిషన్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చి సానుభూతి తెలిపారు.